www.aksharadarbar.com
గురువారం 18, ఏప్రిల్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :66 | సంపుటి :02 | పేజీలు : 05 | వెల : 05

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాతో టచ్‌లో ఉన్నారు..

02

బీఆర్ఎస్ అభ్యర్థులకు బి ఫారాలు అందించిన కేసీఆర్



- ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైలు, ఒక హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్
- బోధన్ మాజీ ఎమ్మెల్యే కొడుకు కేసులో సహకరించిన సీఐ ఒకరు
- మల్టీ జోన్- 1ఐజీ ఏవీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ

05

ఆరుగురు పోలీసు అధికారుల సస్పెన్షన్

మల్టీ జోన్ -1 పరిధిలో పోలీసు విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఆరుగురు పోలీస్ అధికారులను మల్టీ జోన్- 1 ఐజీ ఏవీ రంగనాథ్ సస్పెన్షన్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ అయిన వారిలో ఇద్దరు ఇన్ స్పెక్టర్లు, ఇద్దరు సబ్ ఇన్ స్పెక్టర్లు, ఒకరు హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ఉన్నారు. ఈ సస్పెన్షన్లకు సంబంధించిన వివరాలను మల్టీజోన్ -1 ఐజీ రంగనాథ్ వెల్లడించారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజా భవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ ను తప్పించేందుకే పంజాగుట్ట ఇన్ స్పెక్టర్ తో సంప్రదింపులు జరిపినట్లుగా హైదరాబాద్ సీపీ విచారణలో నిజ నిర్ధారణ కావడంతో బోధన్ ఇన్ స్పెక్టర్ బిడి ప్రేమ్ కుమార్ ను సస్పెండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా సీసీఎస్ ఇన్ స్పెక్టర్ ఎం రమేష్ మద్యం సేవించి పోలీస్ స్టేషన్ కు వచ్చి స్టేషన్ సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయడంతో సీసీఎస్ ఇన్ స్పెక్టర్ ఎం.రమేష్ ను సస్పెండ్ చేశారు. మరో సంఘటనలో జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్ స్టేషన్ లో నమోదైన గంజాయి కేసులో అలసత్వంగా వ్యవహరించినట్లుగా జగిత్యాల ఎస్పీ అందజేసిన విచారణ నివేదిక ఆధారంగా ఎస్సైలు జి. మనోహర్ రావు, తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ బి. రవీందర్ రెడ్డి, కానిస్టేబుల్ టి. నరేందర్ ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ 1 ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. - అక్షర దర్బార్, వరంగల్

- నివేశన స్థలాల కోసం గుట్టల కనుమరుగు
- జనాల మధ్యే బాంబులతో గుట్టలను పేల్చుతున్న వైనం
- ప్లాట్లుగా చేసి విక్రయం
- ఆక్రమణదారులకు అండగా పెద్దలు
- కళ్లెదుటే జరుగుతున్నా అధికారుల ప్రేక్ష పాత్ర

02

తొలిచేస్తున్నారు..!

గ్రేటర్ పరిధిలో రెచ్చిపోతున్న భూ ఆక్రమణదారులు

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూ ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూములను చెరపడుతున్నారు. నగరంలోని అనేక చెరువులు, కుంటలను ఇప్పటికే మాయం చేశారు. ఇంకా అక్కడక్కడ మిగిలి ఉన్న చెరువులను కనుమరుగు చేసే పనిలో ఉన్నారు. ఇక్కడ వివిధ ప్రాంతాల్లో ఉన్న గుట్టలను కూడా కనపడకుండా చేస్తున్నారు. దర్జాగా తొలిచేసి గుట్టల స్థానంలో ప్లాట్లను రూపొందిస్తున్నారు. విలువైన గుట్టల స్థలంలో పాగా వేయడం ద్వారా రూ.కోట్లు గడిస్తున్నారు. వీరికి పెద్దల అండ ఉండటంతో గుట్టల ఆక్రమణ అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతోంది. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తమ కళ్లెదుటే ఆక్రమణదారులు జనాల మధ్యే గుట్టలను అక్రమంగా బాంబులతో పేల్చి వేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోతుండటం చర్చనీయాంశమైంది.

– అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

కి'లేడి'ల అరెస్టు

04

- రూ.6.60లక్షల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన పోలీసులు

నామినేషన్ల పర్వం షురూ..

- వరంగల్ స్థానానికి ముగ్గురు..
- మహబూబాబాద్‌లో ఒకరు నామినేషన్

05

తొలిచేస్తున్నారు..!

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

- గ్రేటర్ పరిధిలో రెచ్చిపోతున్న భూ ఆక్రమణదారులు
- నివేశన స్థలాల కోసం గుట్టల కనుమరుగు
- జనాల మధ్యే గుట్టల్లో బాంబుల మోత..
- ప్లాట్లుగా చేసి విక్రయంతో రూ.కోట్ల ఆర్జన
- ఆక్రమణదారులకు అండగా పెద్దలు
- కళ్లెదుటే జరుగుతున్నా అధికారుల ప్రేక్షక పాత్ర

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూ ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూములను చెరపడుతున్నారు. ఈ క్రమంలో నగరంలోని అనేక చెరువులు, కుంటలను ఇప్పటికే మాయం చేశారు. ఇంకా అక్కడక్కడ మిగిలి ఉన్న చెరువులను కనుమరుగు చేసే పనిలో ఉన్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ వివిధ ప్రాంతాల్లో ఉన్న గుట్టలను కూడా కనపడకుండా చేస్తున్నారు. దర్జాగా తొలిచేసి గుట్టల స్థానంలో ప్లాట్లను రూపొందిస్తున్నారు. విలువైన గుట్టల స్థలంలో పాగా వేయడం ద్వారా రూ.కోట్లు గడిస్తున్నారు. వీరికి పెద్దల అండ ఉండటం వల్ల గుట్టల ఆక్రమణ అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతుంది. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. తమ కళ్లెదుటే ఆక్రమణదారులు జనాల మధ్యే గుట్టలను అక్రమంగా బాంబులతో పేల్చి వేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోపోతుండటం చర్చనీయాంశమైంది.

కనుమరుగవుతున్న గుట్టలు

నివేశన స్థలాల కోసం భూ ఆక్రమణదారులు గుట్టలపై కన్నేశారు. మహానగరం విస్తరిస్తుండటంతో నివేశన స్థలాలకు డిమాండ్ పెరిగింది. దీంతో జనాల మధ్య ఉన్న ప్రభుత్వ భూముల్లోని గుట్టలను ఆక్రమణదారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. కూలీలు, యంత్రాలు, ముందుగుండు సామాగ్రి సహాయంతో గుట్టలను మాయం చేస్తున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా అవసరమైతే బాంబులతో గుట్టలను, బండరాళ్లను పేల్చేస్తున్నారు. భారీ శబ్దంతో అనేక ప్రాంతాల్లోని కాలనీలు దద్దరిల్లుతున్నాయి. ఆక్రమణదారులు ఎలాంటి అనుమతులు లేకుండా బాంబులను వినియోగిస్తున్నారు. భారీ శబ్దం వస్తున్నా సంబంధిత శాఖల అధికారులు ఎవరు కూడా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. తొలగించిన తర్వాత గుట్టల స్థానంలో ఏర్పడుతున్న ప్రభుత్వ స్థలంలో ఆక్రమణదారుల్లో కొందరు ఇండ్లు నిర్మించుకుంటుండగా మరికొందరు ఆ స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు. ఆయా ప్రాంతంలో మార్కెట్ విలువను బట్టి ఒక్కో చదరపు గజం రూ.20వేల నుంచి రూ.50 వేల వరకు గుట్ట స్థలాన్ని అమ్ముతున్నారు. వీరికి స్థానికంగా కొందరు పెద్దల సహకారం ఉంటుందనేది ప్రచారంలో ఉంది.

ఎక్కడెక్కడ అంటే...

మహానగరంలో వరంగల్, హనుమకొండ, కాజీపేటలో అనేక ప్రాంతాల్లో గుట్టల తొలగింపు ఓపెన్ గా కొనసాగుతోంది. అనేక చెరువులు, కుంటలు ఎలాగైతే కనబడకుండా పోయాయో ఇప్పుడు గుట్టల పరిస్థితీ అలాగే తయారైంది. నగర నడిబొడ్డున ఉన్న హనుమకొండ లక్ష్మీపురం, పద్మాక్షి కాలనీ, నంది హిల్స్, దీన్ దయాల్ నగర్, వరంగల్ పైడిపల్లిలోని గుట్టలు, ఉర్సు ఏరియా, కాజీపేట, మడికొండ తదితర ప్రాంతాల్లోని గుట్టలను ఆక్రమణదారులు తొలగించి ప్లాట్లను సిద్ధం చేయడమే పనిగా పెట్టుకున్నారు. రైతులు సాగునీటి కోసం బావుల తవ్వకానికి బాంబులను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడని అధికారులు నగరంలో తమ కళ్లెదుటే జనావాసాల మధ్య ఆక్రమణదారులు అక్రమంగా బాంబులతో పేల్చి ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తుంటే చూసీ చూడనట్లు ఉంటున్న తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా దీన్ దయాల్ నగర్ లోని గుట్టను కొందరు తొలగిస్తుండటాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. అయినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థలాల్లోని గుట్టల ఆక్రమణపై ఉన్నతాధికారులు స్పందించి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

నిర్వహణ లోపంతో విరిగిపోయిన జిమ్ పరికరాలు

ఓపెన్ జిమ్ ఔట్..

పేరుకే జిమ్.. వసతులు నిల్..

నిరుపయోగంగా పరకాలలో అవుట్ డోర్ జిమ్

పట్టించుకోని మున్సిపల్ అధికారులు.

చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజల డిమాండ్

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలోని అమరవీరుల మైదానంలో ప్రజలకు ఉపయోగకరంగా ఉండేందుకు లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన అవుట్ డోర్ జిమ్ వసతులు లేక నిరుపయోగంగా మారింది. నిర్వహణ లోపంతో జిమ్ వస్తువులు చోరీకి గురై అందవిహీనంగా మారింది. ఇంత జరిగినా దానిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనితోపాటు మినీ గార్డెన్ సంరక్షణ లేక మొక్కలన్నీ ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. సాయంత్రం పిల్లలు, విద్యార్థులు, పట్టణ ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు ఏర్పాటు చేసిన పార్కు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఓపెన్ జిమ్ తో పాటు గార్డెన్ ను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చెక్ పోస్టు అధికారులతో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

చెక్ పోస్టుల్లో నిరంతరం పహారా ఉండాలి

- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద నిరంతరం పహారా ఉండాలని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. జనగామ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. చెక్ పోస్టుల్లో సిబ్బంది పకడ్బంధీగా పహారా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా అక్రమ మార్గంలో ఎటువంటి మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోబపెట్టే వస్తువులు తరలకుండా చూడాలని పేర్కొన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. వాహన తనిఖీలు చేపడుతున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాతో టచ్‌లో ఉన్నారు

బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ ఫారాలు అందించిన కేసీఆర్

అక్షర దర్బార్, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లోకి వచ్చారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ప్రచారం, అనుసరించే వ్యూహంపై సమావేశంలో నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, గట్టిగా పోరాడితే లోక్ సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. కాంగ్రెస్‌లో అంతా బీజేపీ పెత్తనమే నడుస్తోందని కొత్తగా కాంగ్రెస్ లోకి వెళ్లిన వారు చెప్పారన్నారు. గతంలో 104 మంది ఎమ్మెల్యేలు ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నించిందని ఇప్పుడు 64 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ వదిలిపెడుతుందా అని విమర్శించారు. రైతుల సమస్యలపై పోరాడతానని ఉద్యమ కాలంనాటి కేసీఆర్‌ని మళ్లీ చూస్తారని స్పష్టం చేశారు. అనంతరం అభ్యర్థులకు బీ ఫాంతో పాటు ఎన్నికల ఖర్చు కింద రూ.95 లక్షల చెక్కులను అందజేశారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

అక్షర దర్బార్, దుగ్గొండి : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పిలుపునిచ్చారు. భూపతి మల్లంపల్లి గ్రామానికి చెందిన 60 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీ వీడి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. కార్యక్రమంలో మల్లంపల్లి మాజీ సర్పంచ్ చుక్క రమేష్, సీహెచ్ రాజేందర్, ఎండీ సర్వర్, వెండి సక్కుబాయి, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు రేల బాబు తదితరులు పాల్గొన్నారు

నాటు వైద్యానికి బాలుడి బలి

అక్షర దర్బార్, ఆసిఫాబాద్: అభం శుభం తెలియని బాలుడు నాటు వైద్యానికి బలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. మల్లేశ్వరి–శ్రీనివాస్ దంపతుల పదేళ్ల కుమారుడు రిషి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో నాలుగేళ్ల కింద ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం పాసిగామ గ్రామ సమీపంలోని పూలాజి బాబా ధ్యాన కేంద్రంలో నాటు వైద్యం ఇప్పించడానికి చేర్పించారు. ఈ క్రమంలో నాలుగేళ్లుగా బాలుడిని దంపతులకు చూపించలేదు. ఎప్పుడు వెళ్లినా ఏవో కారణాలు చెబుతూ నెట్టుకొచ్చాడు. దీంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. రిషి ఆరోగ్యం క్షీణించి మృతి చెందాడని, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండానే మృతదేహాన్ని ఆశ్రమం వెనక పాతిపెట్టినట్లు నాటు వైద్యుడు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసుల ఆధ్వర్యంలో బాలుడిని పాతి పెట్టిన చోట తవ్వకాలు చేపట్టనున్నారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు బోరున విలపించారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై

అవగాహన ఉండాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : లోక్ సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంటు ఎన్నికల నిర్వహణపై విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన జరిగితే సి–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు జారీ చేస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, సువిధ యాప్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు, ప్రచారం నిర్వహించడానికి అనుమతి లేదని అన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించవద్దని తెలిపారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 65 శాతం ఓటింగ్ నమోదైందని, ఈసారి ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నూతన వధూవరులకు ఎమ్మెల్యే దొంతి ఆశీర్వాదాలు

అక్షర దర్బార్, నల్లబెల్లి : మండలంలోని రేలకుంట గ్రామానికి చెందిన బోయిని భాగ్య–సమ్మయ్య దంపతుల కూతురు మానస–రాజేష్ వివాహ వేడుకలకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట నల్లవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, నాయకులు ఉన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం

అఖిల భారత పిఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ

అక్షర దర్బార్, నర్సంపేట : హిందూ ధర్మాన్ని కాపాడుకుందామని అఖిలభారత పిఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ అన్నారు. గురువారం నర్సంపేట పట్టణంలోని శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో ఆలయ కమిటీ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో హనుమాన్ మాలధారణ చేపట్టారు. ముఖ్య అతిథిగా దుర్గాప్రసాద్ స్వామిజీ హాజరై 68 మంది భక్తులకు మాలధారణ చేయించారు. కార్యక్రమంలో మాదాలపు చంద్రశేఖర్ గుప్తా, దొడ్డ రవీందర్ గుప్తా, భూపతి లక్ష్మీనారాయణ, శింగిరికొండ వేణుగోపాల్ గుప్తా, బండారుపల్లి చెంచారావు, ఆకుల ప్రభాకర్, మల్యాల రాజు, అర్చకులు దేవిష్ మిశ్రా, సర్వేషం, మొగిలయ్య, పీఆర్వో కొమురయ్య పాల్గొన్నారు

భక్తులకు హనుమాన్ మాలాధారణ వేస్తున్న దుర్గా ప్రసాద్ స్వామిజీ

బీఆర్ఎస్ లో చేరిన నాయకులకు కండువా కప్పుతున్న చల్లా

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు..

అక్షర దర్బార్, పరకాల : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారికి చల్లా ధర్మారెడ్డి గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మంగలపల్లి రాజయ్య, కుమారస్వామి, నగేష్, రమేష్, మండల అధ్యక్షులు చింతిరెడ్డి మధుసుదన్ రెడ్డి, నాయకులు ఆముదాలపల్లి అశోక్, పల్లెబోయిన రాజు, ఆలేటి రవీందర్, బుర్రి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బారసాల నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

వరికోల్ లో బాలికా జన్మోత్సవం

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండలం వరికోల్ గ్రామంలో గురువారం ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ రోజారాణి, శ్రీదేవి ఆధ్వర్యంలో బాలిక జన్మోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన చెక్క అనిల్ –అఖిల దంపతుల కుమార్తెకు బారసాల నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెన్నెల, మహిళ సాధికారత అధికారి ఎం.మానస, అంగన్ వాడీ టీచర్లు పోశాల రజిత, పూల రాణి, గండ్ర రజిత, సుమలత, సుజాత, సుగుణ, భాగ్యలక్ష్మి, శ్యామలత, రాజేశ్వరి, హేమలత, సూర్య కళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేస్తున్న డాగం శివాజీ

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేత

అక్షర దర్బార్, దుగ్గొండి : మండలంలోని మర్రిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు డాగం శివాజీ తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

సమగ్ర సమాచారం అందించాల్సిందే..

- అభ్యర్థులు అన్ని కాలమ్స్ పూరించాలి
- ఆస్తులు, అప్పుల వివరాలు పేర్కొనాలి
- నేర చరిత్రనూ వెల్లడించాలి
- సోషల్ మీడియా అకౌంట్ సైతం..
- స్పష్టం చేస్తున్న ఎన్నికల సంఘం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల దశ అభ్యర్థులకు అత్యంత కీలకం. ఏ చిన్న తప్పుచేసినా నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. ప్రతిది జాగ్రత్తగా చదువుతూ అన్నింటిని పూరించాలి. నామినేషన్ తో పాటు అఫిడవిట్ ను సమర్పించాల్సి ఉంటుంది. ఈ అఫిడవిట్ లోనూ అన్ని వివరాలు ఉండాలి. దాదాపు బరిలో నిలిచే అభ్యర్థులందరూ నామినేషన్ పూరించడానికి అడ్వకేట్ల సహకారాన్ని తీసుకుంటున్నారు.

అన్ని కాలమ్స్ పూరించాల్సిందే

అభ్యర్థులు అన్ని కాలమ్స్ ను తప్పక పూరించాలి. తొందర తొందరగా పూరిస్తూ మధ్యలో ఏదైన కాలమ్ ను వదిలేస్తే తిరస్కరణకు గురయ్యే అవకాశం లేకపోలేదు. నామినేషన్ లో ఏదైన సమాచారం లేకపోతే ఎన్నికల అధికారి నోటీస్ ఇస్తారు. ఆ నోటీస్ ఆధారంగా సవరించి ఇచ్చే అవకాశం ఉంటుంది. అప్పటికీ సరిగ్గా లేకుంటే నామినేషన్ల పరిశీలన సమయంలో తిరస్కరిస్తారు. అభ్యర్థులు అందించిన వివరాలను ఎన్నికల అధికారులు నోటీస్ బోర్డు పై, ఆన్ లైన్ లోనూ పొందుపరుస్తారు.

ఆస్తులు, అప్పులు వెల్లడించాలి

అభ్యర్థులు అందించే అఫిడవిట్ లో స్థిర, చర ఆస్తుల వివరాలను కచ్చితంగా వెల్లడించాల్సి ఉంటుంది. బ్యాంక్ అకౌంట్ లో డబ్బు ఎంత ఉంది, డిపాజిట్లు, ఇన్సురెన్స్ పాలసీ వివరాలు, ట్రేడింగ్ వివరాలు రాయాల్సి ఉంటుంది. అంతే కాకుండా చేతిలో ఎంత డబ్బు ఉంది, బంగారు, వెండి ఆభరణాల వివరాలు, వాహనాల సమాచారం, వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విషయాలను వెల్లడించాలి. ఆస్తుల వివరాలు రాయడమే కాకుండా అవి ఎలా సమకూరాయో తెలపాలి. అప్పులు ఉంటే వాటి సమాచారాన్ని పేర్కొనాలి. స్థిరాస్తుల ప్రస్తుత ధరను పేర్కొనాలి. అభ్యర్థులతో పాటు వారి కుటుంబసభ్యుల పేర ఉన్న అప్పుల వివరాలు, వారి ఆదాయ మార్గాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కాంట్రాక్టులు ఉంటే వాటి సమాచారాన్ని రాసి ఎన్నికల అధికారులకు అందించాలి.

నేర చరిత్రను పేర్కొనాల్సిందే

అభ్యర్థులు తమకేమైన నేర చరిత్ర ఉంటే నామినేషన్ సమర్పించే సమయంలో వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలి. అఫిడవిట్ లో కేసుల వివరాలను తెలపాలి. ఏదైన కేసుకు సంబంధించి శిక్ష పడి ఉంటే ఆ వివరాలను రాయాల్సి ఉంటుంది. కేసుకు సంబందించి పై కోర్టుకు అప్పీలుకు వెళితే అందుకు సంబందించిన అంశాలను కూడా అఫిడవిట్ లో ప్రస్తావించాలి. సోషల్ మీడియా అకౌంట్ల సమాచారాన్ని కూడా ఇవ్వాల్సి ఉంటుంది. అన్ని వివరాలతో నోటరీ చేయించాల్సి ఉంటుంది.

ఓటర్లకు తెలిసేలా అభ్యర్థుల సమాచారం

ఎన్నికల సమయంలో అభ్యర్థికి సంబంధించిన పూర్తి వివరాలు ఓటర్లకు తెలియాలి. ఎన్నికల సంఘం అభ్యర్థుల పూర్తి సమాచారంతో కూడిన అఫిడవిట్ ను వెబ్ సైట్ లో ఉంచుతుంది. నిబంధనలకు లోబడి అభ్యర్థులు తప్పనిసరిగా అఫిడవిట్ ను అందించాలి. ఈ అఫిడవిట్ లో బరిలో ఉండే వారి ఆస్తుల, అప్పుల వివరాలు, కేసుల, ఇతర సమాచారం అందులో ఉండటం వల్ల ఓటర్లకు పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంటుంది. దీంతో ప్రజలు ఓటు ఎవరికి వేయాలో నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది.

నోటరీ చేయించాలి

- బి.సతీష్, న్యాయవాది

ఎన్నికల నిబంధనలకు లోబడి బరిలో ఉండే వారు తప్పకుండా అఫిడవిట్ సమర్పించాలి. అందులో పేరు, పుట్టిన తేదీ, కులం వివరాలు పేర్కొనాలి. ముఖ్యంగా ఆస్తుల, అప్పుల, పోలీస్ కేసుల వివరాలను పారదర్శకంగా పొందుపరచాలి. అఫిడవిట్ ను నోటరీ చేయించాల్సి ఉంటుంది. తప్పులుంటే న్యాయపరమైన ఇబ్బందులు ఎదురుకావచ్చు. అభ్యర్థుల వివరాలు ఓటర్లు తెలుసుకునే అవకాశం ఉంది.

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాం నాయక్

లేడీ కిలాడీ అరెస్టు

- రూ.6.60లక్షల స్వాధీనం
- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతిని: లేడీ కిలాడీలను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నగదు, బంగారు అభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ లో పేషంట్ల వద్ద ఉండే సహాయకులను నమ్మించి వారి వద్ద ఉన్న బంగారంతో ఉడాయించింది ఓ కిలాడి లేడి. ఫిబ్రవరిలో జరిగిన ఈ ఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేసిన పోలీసులు నేరానికి పాల్పడిన మహిళతో పాటు ఆమెకు సహకరించిన ఇద్దరిని వరంగల్ సీసీఎస్, మట్టెవాడ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ మేరకు గురువారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ వివరాలను వెల్లడించారు. చుంచు స్వప్న అలియాస్ సానియా జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించడానికి ఎంజీఎం హాస్పిటల్ వచ్చే రోగుల సహాయకులను టార్గెట్ చేశారు. అమాయక మహిళలను, వృద్దులను లక్ష్యంగా చేసుకొని వారికి లోన్లు ఇప్పిస్తానని నమ్మించింది. అందుకు ఫొటోలు దిగాల్సి ఉంటుందని, ఫొటో దిగే సమయంలో బంగారం ఒంటిపై బంగారం ఉండొద్దని చెప్పి నగలతో ఉడాయించింది. నిందితురాలు స్వప్న పదేళ్ల కింద ములుగులో ఓ రాబరి కేసులో, 2023లో హనుమకొండ, ములుగు స్టేషన్ల పరిధిలో లోన్లు ఇప్పిస్తానని నమ్మించి మహిళల వద్ద నుండి బంగారు నగలు దోచుకెళ్లిన కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చిందని ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. ఆరు నెలల క్రితం ఆమె మొదటి భర్త ఫిరోజ్ వరంగల్ ఆటోనగర్ సమీపంలోని కోట చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి చెరువులో పడి చనిపోయాడు. ఫిరోజ్ స్నేహితుడైన ఖాజా పాషాను 3 నెలల క్రితం స్వప్న పెళ్లిచేసుకుంది. ఇద్దరు కలిసి దొంగతనాలు చేయాలని నిర్ణయించుకుని దోపిడీలకు పాల్పడ్డారు. భార్యభర్తలతో పాటు వీరికి సహకరించిన హనీఫ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6.60లక్షల నగదు, రూ.5.80లక్షల విలువ చేసే 70.432 గ్రాముల బంగారు నగలు, మొబైల్ ఫోన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

దర్జాగా రోడ్డు కబ్జా

- దారిని మూసి, అందులో అక్రమ నిర్మాణం..
- అధికారులను ఆశ్రయించిన బాధితులు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : నగరంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. నగర సీపీ ఇటీవల కబ్జాదారులపై ప్రత్యేక నిఘా పెట్టినా ఖద్దరు చొక్కా ధరించి కాజేస్తున్నారు. తాజాగా 33 అడుగుల దారిని ఇద్దరు వ్యక్తులు కబ్జా చేసి అందులో ప్రహరీ నిర్మించారు. ఈ అక్రమ నిర్మాణంపై జిల్లా అధికారులకు బాధితులు ఫిర్యాదు చేశారు.
వివరాల్లోకి వెళ్తే.. నగర శివారులోని గొర్రెకుంటలోని 155 సర్వే నంబరులో వై.లక్ష్మి చైతన్య 278.66చ.గజాల స్థలాన్ని జి.సరోజని దేవి నుంచి 2005లో కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఎల్ఆర్ఎస్ కు ఆమె దరఖాస్తు చేసుకున్నారు. కుడా అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి, అన్ని డాక్యుమెంట్లను పరిశీలించి అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం ప్లాట్ చూడటానికి వెళ్లగా వారి ప్లాట్ ముందున్న రోడ్డుపై కొందరు వ్యక్తుల ప్రహరీ నిర్మించారు. ఆరా తీస్తే కాశీబుగ్గకు చెందిన ఓ మాజీ కార్పొరేటర్, గీసుకొండకు చెందిన ఓ నాయకుడు కలిసి కబ్జా చేసినట్లు తెలిసింది. దీంతో బాధితులు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణం కూల్చివేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.



Warangal, 08/04/202[illegible]

To
The Honourable Commissioner,
GWMC
Warangal

Sub: Encroachment of roads East and South Sides of plot
Ref: LRS File No: 16254/2018, Proceeding ID No: KUDAL001685/2015-17, Y Lakshmi Chaitanya Doc No: 11118/2005

Dear Sir/Madam

With reference to the above cited LRS File and ID number, I have 278.66 Sq.Yards plot at Survey No: 155 situated at Gorrekunta, Geesukonda Mandal, Warangal Distr.

As per the above documents and KUDA LRS proceedings we have 33 feet wide roads in the East and South sides of the plot. But some unknown persons occupied the roads on both sides of the plot and built boundary walls. Due to this I am not having the road on both sides to enter in to my plot.

I am here with enclosing documents, site photos with markings and encroached compound wall photos.

So, request you to kindly pursue the matter and provide me the roads on both sides of the plot according to documents and KUDA LRS.

Thanking you,

Yours Obediently
[illegible]
9849113965

Attachments
1. Photo copies of Registration document
2. Photo copy of KUDA LRS Proceedings
3. Original Photos with marking

Copy to:
The District Collector, Warangal

08 APR

బాధితుల ఫిర్యాదు కాపీ

రోడ్డుపై నిర్మించిన అక్రమ నిర్మాణం

ఆ భూమి అటవీ శాఖదే..

అటవీ భూమిపై సుప్రీం కోర్టు కీలక తీర్పు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి పట్టణం కొంపల్లి శివారులో సర్వేనెంబర్ 171 లో గల 106.34 ఎకరాల భూమి కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఆ భూమి పూర్తిగా అటవీశాఖకు చెందుతుందని తీర్పులో వెల్లడించింది. ఆ భూమిపై మహ్మద్ అబ్దుల్ ఖాసిం అనే వ్యక్తి హక్కును కోరుతూ 1985లో వరంగల్ జిల్లా కోర్టులో కేసు వేశాడు. ఈ కేసులో తీర్పు 1994లో అటవీ శాఖకు అనుకూలంగా రాగా, సదరు వ్యక్తి హైకోర్టులో 1994లో అప్పీల్ చేశాడు. ఈ అప్పీలు పిటిషన్ పై 2018లో హైకోర్టు అటవీశాఖకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై మహ్మద్ అబ్దుల్ ఖాసిం రివ్యూ పిటిషన్ ను హైకోర్టులో దాఖలు చేయగా 2021లో హైకోర్టు సదరు 106 ఎకరాల అటవీ భూమి మహ్మద్ అబ్దుల్ ఖాసింకు చెందుతుందని తీర్పు ఇచ్చింది. దీనిపై అటవీశాఖ 2021లో సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఫిబ్రవరి 2024లో వాదనలు విన్న ఇద్దరు జడ్జిల ధర్మాసనం గురువారం తీర్పును వెలువరించింది.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

వరంగల్ లో నామినేషన్ వేసిన బుద్దయ్య

వరంగల్ లో నామినేషన్ వేసిన నర్మద

వరంగల్ లో నామినేషన్ వేస్తున్న శివ

నామినేషన్ల పర్వం షురూ..

- వరంగల్ స్థానానికి ముగ్గురు..
- మహబూబాబాద్ లో ఒకరు నామినేషన్

మహబూబాబాద్ లో నామినేషన్ వేసిన లింగ్యా నాయక్

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : తెలంగాణలోని 17 లోకసభ నియోజకవర్గాల్లో నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన గురువారం మొదటి రోజున స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువగా దాఖలు చేశారు. మల్కాజ్ గిరి స్థానానికి బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్, మెదక్ స్థానానికి బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు నామినేషన్ వేశారు. ప్రధాన పార్టీల నామినేషన్లు మొదటి రోజు చాలా తక్కువగా దాఖలయ్యాయి. అభ్యర్థులు ప్రధానంగా తేదీ, వారం, తిథి, వర్జ్యం చూసుకుని తమకు అనుకూల కాలంలో నామినేషన్ వేయడానికి సిద్ధమయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ స్థానం ఎస్సీకి రిజర్వ్ అయింది. మహబూబాబాద్ ఎస్టీ రిజర్వ్ స్థానం. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ నామినేషన్లు స్వీకరించారు. రైతు సంక్షేమ సమితి సభ్యుడు బానోతు లింగ్యా నాయక్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. వరంగల్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మొదటి రోజు ముగ్గురు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. అలయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ (రిజిస్టర్డ్ పార్టీ) అభ్యర్థిగా అంబోజు బుద్దయ్య, స్వతంత్ర అభ్యర్థి గా బరిగెల శివ, పిరమిడ్ పార్టీ అఫ్ ఇండియా (రిజిస్టర్డ్ ఆన్ రేకగ్నైజ్డ్) పార్టీ అభ్యర్థిని గా తౌటపల్లి నర్మదా ఒక్కొ సెట్ చొప్పున జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ కార్యాలయంలో నామినేషన్లు వేశారు.

102 స్థానాల్లో నేడు పోలింగ్

సార్వత్రిక ఎన్నికలు ఏడు విడతల్లో నిర్వహిస్తుండగా తొలిదశ కింద 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 102 లోక్సభ స్థానాలకు శుక్రవారం పోలింగ్జరగనుంది. ఈ విడతలో మొత్తం 1625 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా 16కోట్ల 63 లక్షల మంది ఓటర్లు వారి భవితవ్యాన్ని నిర్దేశించనున్నారు. ఓటింగ్కోసం లక్షా 87వేల పోలింగ్కేంద్రాల్ని ఏర్పాటు చేసిన ఈసీ, ప్రక్రియ సజావుగా సాగేందుకు కేంద్ర బలగాలను మోహరించింది. సార్వత్రిక ఎన్నికల తొలి విడత పోలింగ్కు సర్వం సిద్ధమైంది. ఈ ఎన్నికలకు ఈసీ పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఈవీఎంలు, వీవీప్యాట్ల పంపిణీ పూర్తి కాగా సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు తరలి వెళ్లారు. 102 లోకసభ స్థానాలకు జరిగే పోలింగ్లో 16.63 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనుండగా, ఇందుకోసం 1.87 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 18 లక్షల మంది సిబ్బంది ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుంది. కొండ ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో మాత్రం సాయంత్రం ఐదు గంటలకే ముగియనుంది.

తొలివిడత ఎన్నికలు జరిగే స్థానాల్లో 73 జనరల్, 11 ఎస్టీ, 18 ఎస్సీ నియోజకవర్గాలు ఉన్నాయి. 1625 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో 1491 మంది పురుషులు, 134 మంది మహిళలు ఉన్నారు. 16.63 కోట్ల మంది ఓటర్లలో 8.4 కోట్లు పురుషులు, 8.23 కోట్లు మహిళలు కాగా, 11 వేల 371 ఇతరులు ఉన్నట్లు ఈసీ వెల్లడించింది. 35.67లక్షలమంది తొలిసారి ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. 85 ఏళ్లు దాటిన 14.14 లక్షల మంది వృద్ధులు, 13.89 లక్షల మంది దివ్యాంగులు వారికి సౌకర్యం ఉన్న చోట ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్న ఈసీ, 102 నియోజకవర్గాల పరిధిలో 5 వేలకు పైగా పోలింగ్ కేంద్రాల్లో పూర్తిగా మహిళలే విధులు నిర్వహిస్తున్నట్లు వివరించింది. వెయ్యి పోలింగ్ కేంద్రాలను దివ్యాంగులు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. తొలి విడత పోలింగ్ నిర్వహణ కోసం 41 హెలికాప్టర్లు, 8 ప్రత్యేక రైళ్లు, లక్ష వాహనాలు వినియోగిస్తున్నట్లు ఈసీ పేర్కొంది. ఎన్నికలను శాంతియుతంగా, సజావుగా నిర్వహించేందుకు ఈసీ పలు కీలక చర్యలు చేపట్టింది.

ఆరుగురు పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటు

- ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైలు, ఒక హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్
- బోధన్ మాజీ ఎమ్మెల్యే కొడుకు కేసులో సహకరించిన సీఐ
- ఉత్తర్వులు జారీ చేసిన మల్టీ జోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్

అక్షర దర్బార్, వరంగల్: విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఆరుగురు పోలీస్ అధికారులను మల్టీ జోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండైన వారిలో ఇద్దరు ఇన్ స్పెక్టర్లు, ఇద్దరు సబ్ ఇన్ స్పెక్టర్లు, ఒకరు హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ఉన్నారు. ఈ వివరాలను మల్టీజోన్ -1 ఐజీ రంగనాథ్ వెల్లడించారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజా భవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ ను తప్పించేందుకే పంజాగుట్ట ఇన్ స్పెక్టర్ తో సంప్రదింపులు జరిపినట్లుగా హైదరాబాద్ సీపీ విచారణలో నిజ నిర్ధారణ కావడంతో బోధన్ ఇన్ స్పెక్టర్ బి.డి ప్రేమ్ కుమార్ ను సస్పెండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా సీసీఎస్ ఇన్ స్పెక్టర్ ఎం.రమేష్ మద్యం సేవించి పోలీస్ స్టేషన్ కు వచ్చి స్టేషన్ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేసినట్లుగా అధికారుల దృష్టికి రావడంతో ఏసీపీ విచారణ నిర్వహించారు. విచారణలో నిర్ధారణ కావడంతో సీసీఎస్ ఇన్ స్పెక్టర్ యం.రమేష్ ను సస్పెండ్ చేశారు. మరో ఘటనలో జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్ స్టేషన్ లో నమోదైన గంజాయి కేసులో అలసత్వంగా వ్యవహరించినట్లుగా జగిత్యాల ఎస్పీ అందజేసిన విచారణ నివేదిక ఆధారంగా ఎస్సైలు జి.మనోహర్ రావు, తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ బి.రవీందర్ రెడ్డి, కానిస్టేబుల్ టి.నరేందర్ ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.